
# పండగోపాఖ్యానం

ఉదయ్ చల్లాపల్లి




నా స్నేహితుడు సుబ్రహ్మణ్యానికి పండగలంటే మహా ప్రాణం. వాడికి చిన్న పండగలు, పెద్ద పండగలు అనే భేదభావం అస్సలు లేదు. పండగేదైనా సరే పద్ధతి ప్రకారం జరగాలి, జరుపుకోవాలి అంటాడు. అంటే బై ద బుక్ అన్న మాట. ఏమాత్రం తేడా జరిగినా, దండగ పండగలు అని ఎవరైనా పరిహసించినా సహించడు, క్షమించడు. అలా పద్ధతి కోసం పాకులాడి ప్రాణంమీదకి తెచ్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇన్ని జరిగినా వాడికా పిచ్చుమాత్రం పోలేదు. అందుకే వాడిని మేము చిన్నప్పుడు పండగ పిచ్చాడు అని ముద్దుగా పిల్చుకునేవాళ్ళం. మా చదువులు అయిపోయిన తరువాత ఉద్యోగాల వేట, తరువాత విదేశీ వలస మరియు సంసారాల ఈతలతో దాదాపు పదేళ్ళు వాడిని కలవటం తటస్థించలేదు. చివరికి నేను భారతదేశంమీద మక్కువతో వెనక్కి రావటం, అదే సమయానికి వాడు కూడా స్వదేశానికి తిరిగి రావటంతో ఇదిగో మళ్లీ ఇలా కలుసుకోవటం జరిగింది. వాడిని కలిసిన తరువాత నేను అడిగిన మొదటి ప్రశ్న.

"ఏరా పండగలు ఎలా జరుగుతున్నాయి అని?" ఆ ప్రశ్నకి వాడు కించిత్ వ్యథ చెంది అన్నాడు. "ఎక్కడరా? ఈ సన్నాసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పుణ్యమా అని చాలా పండగలు మిస్ అవుతున్నాను" అని.

"ఏరా? కనీసం పండగలకి కూడా శెలవులు లేవా మీకు?" అని నేను అమాయకంగా ప్రశ్నించాను.

"ఆ! వాళ్ళ మొహం. ఏదో వాళ్ళ దృష్టిలో ముఖ్యమైన పండగలకి సెలవలు ఇస్తారు. అన్నిటికీ ఇస్తారా ఏంటీ" అన్నాడు బాధగా.

"ఇంతకీ ఏ పండగలు మిస్ అయ్యావని అంత బాధపడుతున్నావు?" అని అడిగా.

"మొన్నీమధ్యనే మహారాష్ట్ర సంతాల్ తెగ పండగ మిస్ అయ్యాను" అన్నాడు.

నేనోసారి గతుక్కుమని- "ఈ సంత ఎవరురా?" అని అడిగా. వాడికి కించిత్ కోపం వచ్చినా, నా అమాయకత్వం మీద జాలిపడి చెప్పాడు. అది సంత కాదు. సంతాల్ అనే మహారాష్ట్ర, ఒరిస్సాలలో ఉండే ఆదివాసి తెగ పేరు అని. అంతేకాకుండా, ఆ తెగ పుట్టుపూర్వోత్తరాలు, వారి ఆచార వ్యవహారాలూ, కట్టుబాట్లు, పండగల గురించి ఓ పావుగంటపాటు ఉత్సాహంగా నేను మధ్యలో చాలని వారిస్తున్నా వినకుండా నా మెదడులోని సగ భాగాన్ని చెంచాతో తినేసాడు. అప్పటికి కాని నాకు అర్థం కాలేదు. వీడి పండగల పిచ్చి పరాకాష్ఠకి చేరుకుంది అని. ఈ విషయం మా ఆవిడకి చెప్తే నాకో అల్టిమేటం ఇచ్చింది. వాడికి కొంచెం దూరంగా ఉండమని. ఎందుకంటే ఇప్పుడు ఉన్న పండగలకే వంటలు చెయ్యలేక ఛస్తుంటే మళ్లీ నేను కొత్తపండగలు, సరికొత్త వంటలు తెచ్చి నెత్తిన పెడతాననే భయంతో.

ఎంత దూరంగా ఉందామని ప్రయత్నించినా వాడు వదలకుండా వేటాడి, నన్ను పండగల విషయంలో అక్షరాస్యుడిని చేయాలని కంకణం కట్టుకుని రకరకాల పండగల గురించి చెప్తూ అడపాదడపా నా మెదడులో మిగిలిన సగభాగాన్ని ఆరగిస్తూనే ఉన్నాడు.

ఓ రోజు ఆఫీస్‌లో పనిచేసుకుంటుంటే మా వాడి శ్రీమతి దగ్గరనుంచి ఫోన్. "అన్నయ్యగారూ మీరు అర్జంట్‌గా రావాలండి" అని.

"ఏమ్మా ఏమైంది?" అని అడిగాను.

"అవన్నీ తరువాత చెప్తాను. మీరు ఉన్నఫళంగా మా పిల్లల స్కూల్ దగ్గరకు వచ్చెయ్యండి" అంది.

ఏం జరిగిందో అర్థంకాక ఆఫీస్‌లో ఎక్కడ పని అక్కడ వదిలేసి పరిగెత్తుకుంటూ స్కూల్ దగ్గరికెళ్ళి కంగారుగా అడిగాను. "ఏమ్మా ఏం జరిగింది..అందరూ క్షేమమేనా?" అని.

"ఏం లేదు అన్నయ్యగారూ! మీకు మావారి పండగల పిచ్చి తెలిసిందేగా! ఈ రోజు అదేదో రాజస్థాన్ వాళ్ళ పండగట. నేను స్కూల్ వాళ్ళు ఒప్పుకోరు అని ఎంత మొత్తుకున్నా వినకుండా, పిల్లలకి తలపాగాలు అవి కట్టి విచిత్రంగా తయారుచేసి స్కూల్‌కి పంపించారు. స్కూల్‌వాళ్ళకి మండి వీళ్ళని తిరుగు టపాలో ఇంటికి పంపించేసారు. దాంతో ఈయనకి విపరీతమైన కోపం వచ్చి స్కూల్‌వాళ్ళ మీదకి దాడికి దిగారు. ఇప్పటికి గంట అయ్యింది ఈయన ప్రిన్సిపాల్ రూంలోకి వెళ్ళి. ఈయన అరుపులు వినిపిస్తున్నాయి తప్ప, అవతల వాళ్ళ గొంతులు వినపడటం లేదు. పోనీ నేను లోపలికి వెళ్దామంటే నన్ను కరుస్తారేమోనని భయం. అందుకనే నాకు దిక్కుతోచక మిమ్మల్ని రమ్మన్నాను. మీరే ఎలాగైనా ఆయనని బయటకు లాక్కురావాలి" అంది.

తలుపు తీసుకుని ప్రిన్సిపాల్ రూంలోకి వెళ్ళాను.

నేను వెళ్లేసరికి అక్కడ పరిస్థితి నాకు కొంచెం విషమంగానే తోచింది. ఒకవైపు మావాడు ప్రిన్సిపాల్ బల్ల ఎక్కి నుంచుని ఆవేశంతో ఊగిపోతూ ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుగా ఉపన్యసిస్తున్నాడు. మావాడి వాగ్ధాటికి అడ్డుకట్టే లేదు. భారతదేశ సమైక్యత, సుహృద్భావం, భిన్నత్వంలో ఏకత్వం, మన సంస్కృతి సాంప్రదాయాలు, మన పండగలు వాటి ప్రాముఖ్యత తదితర విషయాల గురించి గుక్కతిప్పుకోకుండా మాట్లాడుతున్నాడు. మరోవైపు ప్రిన్సిపాల్, మరో ముగ్గురు టీచర్లు బిక్కచచ్చిపోయి, మొహం జీవకళ నశించి ఇప్పుడో మరో క్షణంలోనో అన్నట్టుగా ఉన్నారు. నన్ను చూడగానే వాళ్ళు దీనంగా రక్షించమన్నట్టుగా కళ్ళతోనే ప్రాధేయపడ్డారు. నేనో పావుగంటపాటు కుస్తీపట్టి మా వాడిని బలవంతంగా బల్లమీంచి కిందకి దించాను. అప్పటికి కూడా మావాడు వాళ్ళని వదలకుండా మళ్లీ ఇంకెప్పుడు ఏ పండగని అవమానించమని వాగ్దానం తీసుకున్న తరువాత కానీ వదల్లేదు. మా వాడి దెబ్బకి ఏనుగులా ఉండే ప్రిన్సిపాల్ పాపం పీనుగులా అయిపోయింది. దాంతో మళ్లీ మావాడి బారిన పడకుండా ఉండటానికి వీడి పిల్లలకి స్కూల్ డ్రస్‌ల నుంచి ఎగ్జంప్షన్ కూడా ఇచ్చేసింది. నేను మాత్రం వీడి పిచ్చి తగ్గే మార్గం తెలీక జుట్టు పీక్కుంటూనే ఉన్నాను.

ఇది జరిగిన కొన్ని రోజులకి మావాడు నాకు ఫోన్ చేశాడు పై ఆదివారం మా ఇంటికి నువ్వు కుటుంబ సమేతంగా భోజనానికి రావాలీ అంటూ. ఆరోజు పొరపాటున ఏదన్నా పండగేమోనని నాకో అనుమానం కలిగింది. కానీ అడిగే ధైర్యం చెయ్యలేక సరే వస్తానని మాట ఇచ్చేసాను. మాటైతే ఇచ్చాను గాని లోపల ఎక్కడో నాకు వీడు ఏదన్నా పండగ పేరు చెప్పి పీడిస్తాడేమోనని మనసు పీకుతూనే ఉంది. అందుకని అనుమాన నివృత్తి కోసం ఆ రోజు సాయంత్రం సరాసరి బ్రిటీష్ లైబ్రరీకి వెళ్లి అక్కడ రిఫరెన్స్ సెక్షన్‌లో భారతదేశ పండగలకి సంబంధించిన పుస్తకాలన్నీ ఒక్కటి కూడా వదలకుండా తిరగేసాను. పొరపాటున ఏ కొండజాతి వాళ్ళ పండగేమన్నా వచ్చే ఆదివారం ఉందేమోనని. ఏ పండగా లేదని నిశ్చయించుకున్న తరువాత హమ్మయ్య అని ఊపిరి

పీల్చుకున్నాను.

మొత్తానికి పై ఆదివారం రానే వచ్చింది. నా శ్రీమతి మరియు పిల్లల్ని తీసుకుని ఆరగించబోయే విందు గురించి ఊహించుకుంటూ నేను మా వాడి ఇంటికి చేరుకున్నాను. మేము అక్కడికి చేరుకునేసరికి ఇంటి లోపలనుంచి పొగలొస్తున్నాయి. అది చూసి నేను మా ఆవిడతో అన్నాను.

"అబ్బో! వీడు మనం వస్తున్నామని భారీ ఎత్తునే వంటలు చేయిస్తున్నట్టుగా ఉన్నాడు అని"

మా ఆవిడ నా వంక జాలిగా చూసి అంది. మరీ అంత సంబరపడిపోకండి. లోపలికి వెళ్ళాక కదా తెలిసేది. అది వంటయో లేక మనకి తంటాయో అని.

"నీకు అన్నీ అనుమానాలే" అని విసుక్కుని లోపలికి అడుగు పెట్టాను.

అక్కడ దృశ్యం చూసి నాకు కాసేపు నోటమాట రాలేదు. అక్కడ నట్టింట్లో కట్టెలతో మంటపెట్టి ఉంది. దాని చుట్టూ మా వాడు, వాడి ఇద్దరు పిల్లలు మొలకి ఆకులతో చేసిన గోచీ లాంటిదేదో తగిలించుకుని, అర్థం కాని అరుపులు అరుస్తూ, పిచ్చి పిచ్చి కూతలేవో పెడుతూ, చేతుల్లో ఉన్న చిన్నపాటి డప్పులను బాదుతూ ఆ మంటచుట్టూ తిరుగుతున్నారు.

నేను భయపడినంతా అయింది. ఇదేదో కచ్చితంగా పండగే అనుకుని గిర్రున వెనక్కి తిరిగి పారిపోబోతుంటే వాడు నన్ను చటుక్కున పట్టుకుని,

"గాంగో గాంగో" అనో కేక పెట్టాడు.


నేను దీనంగా అడిగాను. ఇప్పుడీ కూతకి అర్థం ఏమిట్రా అని.

"ఇది కూతకాదురా కుంకా..గాంగో అంటే ఆఫ్రికన్ భాషలో వెల్‌కం అని అర్థం" అని చెప్పి నా కళ్ళు తెరిపించాడు.

"అంటే ఇప్పుడు ఇక్కడ జరుగుతోంది పొరపాటున ఆఫ్రికన్ పండగ ఏదన్నానా?" అని ధైర్యం కూడగట్టుకొని అడిగాను.

"పొరపాటు ఏమిట్రా, ఇది ఖచ్చితంగా మన ఆఫ్రికన్ పండగే. రా చెప్తాను" అని మమ్మల్ని లోపలికి తీసుకెళ్లి ఓ పావుగంటపాటు నాకు పండగోపదేశం చేసాడు. నాకు ఇప్పుడు విషయం పూర్తిగా అర్థం అయ్యింది. వీడు భారతదేశమే కాదు, ప్రపంచంలోని ఏ పండగనీ వదిలిన పాపాన పోలేదని. ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా మనసులోనే గుండె బాదేసుకున్నాను. ఉపదేశం అయిపోయిన తరువాత లోపల్నించి నాకు, నా పిల్లలకి ఆకుబట్టలు తెచ్చి బలవంతంగా కట్టించాడు.

అప్పటికే మా ఆవిడ నా దివ్యమంగళ విగ్రహం వైపుక్రూరంగా చూస్తోంది. 'ఇంటికెళ్ళాక నీ సంగతేదో తేలుస్తాను' అన్నట్టుగా ఉందా చూపు. చివరికి నేను, నా పిల్లలు, వాడు వాడి పిల్లలతో కలిసి, ఓ గంటపాటు రకరకాల కూతలు, శబ్దాలు చేస్తూ, మా ఆవిడకి మంటెక్కిస్తూ అక్కడ మంట చుట్టూతా నృత్య విలాసం చేసాం. మా విన్యాసాలన్నీ పూర్తి అయిన తరువాత చివరగా మా వాడు బాదం ఆకుల్లో నాలుగు బాతుగుడ్లు పట్టుకొచ్చాడు. నన్ను అవి తినమని, లేకపోతే పండగ పూర్తికాదని బలవంతం పెట్టాడు.



నేను మా ఆవిడ వైపుచూసే సాహసం చెయ్యలేదు. ఆవిడ మొహంలోని ఎక్స్‌ప్రెషన్స్ నాకు అప్పటికే కళ్ళముందు సినిమా రీలు తిరిగినట్టుగా తిరుగుతున్నాయి. ఈ బాతుగుడ్లపాలిట నా భార్య పడకుండా వుండాలంటే నన్ను రక్షించే వారెవ్వరా అని ఆలోచిస్తుంటే, మహానుభావుడు పోతన రాసిన గజేంద్రమోక్షంలోని పద్యం చప్పున గుర్తుకొచ్చింది.



లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప ఇతఃపరంబెరుగ మన్నింపం దగున్ దీనునిన్
రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా!

'అవును. ఇప్పుడు నాకు ఈశ్వరుడే దిక్కు వేరెవ్వరు లేరు' అనుకుని, మనసులోనే ఆయనని ప్రార్థించి, మా వాడిని ప్రాధేయపడ్డాను. ఆ బాతుగుడ్లు తినలేని అసహాయుడినని, నన్ను వదిలెయ్యమని. ఏమనుకున్నాడో ఏమో! సర్లేపో అని ఊరుకున్నాడు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని, తరువాత భోజనానికి కూడా ఉంటే అందులో ఇంకేం చూడాల్సి వస్తుందో అని భయపడి, వాడిని బ్రతిమాలి ఆరోజు భోజనం చెయ్యలేని మా నిస్సహాయతని మన్నించమని వేడుకుని అక్కడ నుంచి బ్రతుకు జీవుడా అని బయటపడ్డాను. దారిలో వస్తుంటే మా ఆవిడ ఎందుకో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. నాకు ఎందుకో తుపాను ముందర నిశ్శబ్దం లాగా అనిపించింది అది. ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ నా ఆరేళ్ళకూతురు అమాయకంగా అడిగింది.

"అమ్మా నువ్వు కూడా మాకులా డ్రెస్ వేసుకుని డాన్స్ ఎందుకు చెయ్యలేదు?" అని. ఆ మాటతో అగ్నికి ఆజ్యం పోసినట్టు అయ్యింది. ఆ తరువాత ఏం జరిగిందో ఈ కథ పరిధిలోకి రాదు కాబట్టి, దానిని మీ ఊహకే వదిలేస్తున్నాను.

○